# గుడ్డి వెలుతురు

దూరం నుంచి చూస్తే అంతా చిమ్మచీకటిగా ఉంది. ఏం కనిపించటం లేదు. రైతు బజారుకెళ్ళి నాలుగు కూరలేసుకుని వద్దామని బయల్దేరిన నాకు రైతుబజారుకావేళ సెలవా అని అనుమానం వచ్చింది. అయినా వెనక్కి తిరగబుద్ధి కాలేదు. అంతగా మూసి ఉంటే అప్పుడే తిరిగి వెళ్ళిపోవచ్చులే అని ముందుకే అడుగులు వేశాను. ఆ రోడ్డులో ఎప్పుడో గానీ దీపాలు ఉండవు. కళ్ళకు గంతలు కట్టుకున్న గాంధారిలా నడుచుకుంటూ వెళ్ళడమే. ఎదురుగా దీపాలు లేని సైకిళ్ళు వస్తూనే ఉంటాయి.

నల్లగా చీకటల్లో కలిసిపోయినవాళ్ళు దగ్గరగా వచ్చి తెల్లగా పళ్ళికిలించి అయ్యో అని తప్పుకుంటూనే ఉంటారు. కాశీ మజిలీ కథలో అడవిలోముసలమ్మ గుడిసెలో కనిపించే దీపంలా మిణుకుమిణుకుమంటూ ఒక దీపం కనిపించింది. ఏమిటోఅర్థం కాక ముందుకు కదిలాను. తీరా చూస్తే కరెంట్ దీపాలు లేని ఆ రైతుబజార్లో కూరలు పరుచుకుని అమ్ముకోడానికి కూర్చున్న వాళ్ళు ఏం చెయ్యాలో తోచకుండా అయోమంగా ఉన్నారు.

అంతా దాదాపు ఆడవాళ్ళే., ఒకటీ అర కొవ్వొత్తులు గుడ్డివెలుతురు పంచుతూ రెపరెపలాడుతున్నాయి. తల్లుల వెంట పిల్లలు గీరుగారుమంటూ సతాయిస్తున్నారు. అమావాస్య రెండు మూడురోజులుందేమో సహజంగా ఉండె వెలుగు కూడా అస్సల్లేదు.

ఒక కొట్టు దగ్గర ఆగి అవేమిటో తెలుసుకునే సరికి చాలా అవస్థయ్యింది.

ఒకవేళ ఏదైనా కొందామన్నా డబ్బులివ్వడం ఎలాగా అని సందేహం వచ్చింది. నేను ఒక గుడ్డి దీపం వెలుగుతున్న దుకాణం వైపు నడిచా. కొవ్వొత్తికి రెండు వైపులా వెదురు తట్టలు అడ్డం పెట్టి ఒక పడుచువాడూ కూర్చున్నాడు. నేను మాట్లాడేలోపుగా అతనే 'చెప్పండమ్మా! ఏం కావాలి' అన్నాడు.

'కరెంటు పోయిందా?' అన్నాను.

'పోవడం ఏంటి తల్లీ! అస్సలియ్యేల కరెంట్ రాలేదు. దీపాలే ఎలగలేదు' అన్నాడు.

'అదేమిటీ?' ఆశ్చర్యంగా అడిగాను.

'అయిదు గంటలకాణ్ణించి ఇదిగో లైట్లు, అదిగో లైట్లు అంటూ కూరలు పరుచుకున్నాం. సీతాకాలం కాస్త ముందస్తుగానే సీకటి పడింది గానీ కరెంటు రాలేదు'.

'అయ్యో! మరెలాగూ'

'ఎలాగంటే ఏముంది? మూటలు కట్టుకుపోవచ్చు. సాయంకాలం బేరాలుంటా యని ఆశ' నెమ్మదిగా అన్నాడు.

ఆడాళ్ళు నిరాశగా కళ్ళల్లో వత్తులు వేసుకుని 'ఇటురండమ్మా వంకాయలు ఆరమ్మా - అయిదే వేసుకోండి - ఇదిగో ఈ పువ్వు అసలు పది ఏడిచ్చి తీసుకోండి' అంటున్నారు.

ఏడ్చే పిల్లల్ని సముదాయిస్తూ, పాలుతాగే పిల్లల్ని గదమాయిస్తూ, విసుగ్గా, మూటలు కట్టేద్దామా, కాసేపు చూద్దామా అనే సంశయంలో పడి ఉన్నారు.

మొత్తం రైతు బజార్లో అక్కడక్కడా మూడు, నాలుగు కొవ్వొత్తులు వెలుగు తున్నాయి. అవీ గాలికి ఆరీ వెలిగీ అన్నట్టు.

నేను కొవ్వొత్తి వెలుగుతున్న పడుచు కుర్రాడి దగ్గరే ఒకటి రెండు కూరలు కొన్నాను. నిజానికి నేనెప్పుడూ ఆడవాళ్ళదగ్గరే కొంటాను. వాళ్ళతో మాటలు కలుపుతూ ఉంటాను. వాళ్ళ సంగతులు, సమస్యలూ చెప్తూ ఉంటారు. నేనూ తోచింది మాట్లాడుతూ ఉంటాను.

'అమ్మా వెళ్ళిపోతున్నావ్ - ఈడనమ్మా' అంటూ ఒక పరిచిత కంఠం విని పించింది.

నాకు ఇక్కడున్న ముగ్గురు, నలుగురు ఆడవాళ్ళు కూరలిస్తూ ఉంటారు. వాళ్ళలో ఎవరో నన్ను పిలుస్తున్నారని అర్థమైంది.

'ఏంటీ-నేనమ్మా, పుష్పను' అంది. ఆమె కనిపించింది. చంకలో చంటివాడు. వాడు ఆమె దగ్గర నిలబడటం లేదు. ఆ చీకట్లో వదిలితే ఎటు పోతాడో అని భయంతో చంకలోనే ఊపుతూ తీసుకోమ్మా అంది.

'ఇంత చీకట్లో ఏం చూస్తాం, ఏం కొంటాం' అన్నాను.

'మా బతుకులే చీకట్లో ఉండాయి. ఈ కరెంటోళ్ళు లైటులెందుకిస్తారు' అంది పుష్ప నిరాశగా.

నాకేం సమాధానం చెప్పడానికి తోచలేదు. కూర్చుని కూరలు ఎంచడం మొదలు పెట్టాను.

'పొద్దుట్నించి రాలేదమ్మా. ఇదిగో ఈడికి పోలియో చుక్కలు ఏపిచ్చేదానికి పోయినా - నాలుగు గంటల వరకూ అక్కడే సరిపోయింది. తీరా ఇక్కడికి వచ్చి కూరలు సర్దేసరికి సీకటే పడింది. ఒక్క రూపాయి బేరం లేదు' అంది పుష్ప బాధగా.

ఏవో కొన్ని వేసుకుందామని తట్టలోకి ఏరుతున్నాను. దూరంగా ఒక యువకుడు గట్టిగా అందరికీ వినిపించేలా మాట్లాడుతున్నాడు.

'ఎవరైనా దెయ్యాల సినిమా తీసేదుంటే మన రైతుబజారు సక్కగా సరిపోతుంది. చీకట్లో చూస్తారు చూడూ - అట్లాంటి సినిమా మంచిగా తీయచ్చు. లైట్లూ, గియట్లూ అవసరం లేదు. సగం చీకటి -కాస్త వెలుగు. ఎట్టా తియ్యాలో నేనే సక్కగా చెప్పగల్ను - మ్యూజిక్ కొట్టేదానికా పట్నాయక్‌ని తోలకొస్తే చాలు. దదదదలాడిస్తాడు - మరి అందరూ భయంతో వణకాలి - అదిగో ఆ లెట్రిన్ దొడ్ల కాడ్నే, మంచుదెయ్యాన్ని ఇటుగా నడిపిస్తే - మజాయే మజా-'

కొందరు సన్నగా నవ్వుతున్నారు.

'సచ్చినోడికి సర్దాగా ఉంది. సీకట్లో సిందులేస్తావుంటే' అని ఒక ముసల్ది గట్టిగా విసుక్కుంది.

'ఎంతివ్వాలి' అన్నాను.

ఆమె చేతిలో పిల్లాడు నిలవడం లేదు. వాడు జారిపోతున్నాడు.

'అమ్మా ఓ పది రూపాయలివ్వండి. రేపొచ్చి లెక్కచూసి మిగిలినవి ఇవ్వచ్చు' అంది.

అలవాటుగా చేతికి తగిలే పది నోటు ఆమెకిచ్చి 'ఇంకా డబ్బులొస్తాయి రేపో, ఎల్లుండో వచ్చి ఇస్తా' అని చెప్పాను.

'సర్లేమ్మా' అంది - అని పక్కకి తిరిగి గట్టిగా అరవడం మొదలు పెట్టింది.

'ఓ సాయన్నా - నీ కూరలు కట్టిపెట్టయ్యా. నేనింటికి పోతా - ఈ సీకట్లో బాగోతం నా సేతగావట్లేదు' అంటోంది పెద్దగా పుష్ప.

ఇదిగో సినిమాల్లో సిరంజీవి లెవల్లో వస్తున్నా అంటూ యువకుడు ఒక పరుగున వచ్చాడు.

వాడి ముఖంలో చీకటి తాలూకు బాధా, భయం, బెంగ ఏమీలేవు. మహా హుషారుగా ఉన్నాడు.

'ఏవయ్యా కరెంటు లేక అంతాచిరాకుపడి బాధపడుతుంటే నువ్వు మాత్రం మహా సరదాగా ఉన్నావే' అన్నాను.

'నాకేంటమ్మా నేను మగాణ్ణి' అన్నాడు.

నేను మగాణ్ణి అన్న మాటల్లో నాకు కోటి అర్థాలు స్ఫురించాయి. అతని మాటల్లో హాస్యం ఉన్నా, దాని వెనుక సత్యం ఉందనిపిస్తుంది. మళ్ళీ అందుకున్నాడు.

'అయినా కరెంటు పోయిందనీ, రోడ్లు బాగాలేవనీ, మంచినీళ్ళ నల్ల రాలేదని బాధపడితే ఈ దేశంలో బతకలేం' అన్నాడు అక్కడికి ప్రపంచ దేశాలన్నీ చూసి వచ్చినట్టు.

నిజమేననిపించింది. నిత్యావసర విషయాలు కూడా ఇక్కడ లగ్జరీలయి పోయాయి.

తూనీగా... తూనీగా... ఎందాక పరిగెడతావే... రావే నా వంకా... అంటూ గట్టిగా పాడుతూ అర నిముషంలో పుష్ప కూరలన్నింటినీ, మూటల్లోకీ, గంపల్లోకీ సర్ది కట్టేశాడు సాయన్న.

'పైసలు గుంజడానికే గవర్నమెంటోళ్ళు - కరెంటెందుకు పోయిందని అడిగే మగాళ్ళే లేరు' అంది ముసల్ది కసిగా.

'మగాడు అడిగేదానికి కాదు. ఆనందంగా ఉండడానికి' అన్నాడు యువకుడు.

పవర్ పోవడం అనేది వార్తకాదు ఈ దేశంలో. అదిపోకుండా ఉంటే అది ఆశ్చర్యం. కానీ ఒక్కోసారి గంటలు గంటలు దీపాలు లేకుండా ఎంతోధర్మబద్ధంగా దేశం నడిచిపోతూ ఉంటుంది.

చిన్నకారు ప్రజలెంత నష్టపోతారో, వారి బతుకెంత అతలాకుతలమైపోతుందో ఎవ్వరూ ఆలోచించరు.

మర్నాడు పుష్ప చెప్పింది. సాయంత్రం అమ్మేసుకునే ఆకు కూరలు అమ్ముకోలేక, సరిగ్గా మూట కట్టుకోలేకపోవడంతో కొంత పాడయిపోయాయి. రెండు సొరకాయలు ఎవరో చీకట్లో కాజేశారు. ఒక కాలిఫ్లవరు మాయమైంది.

ఒక్కరోజు వాళ్ళ నష్టం వారం రోజులు కష్టపడినాగానీ పూడ్చుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. గ్రిడ్ కాలిపోయింది అనే వార్తలు పేపర్లో చదివి–

'అవును మరి. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు?' అని మధ్య తరగతి సానుభూతి తప్ప విషయం ఆవగింజంతైనా తెలదు. సమస్య తీరదు.

పూర్వం వానరాక, ప్రాణం పోక తెలీదని సామెత. కానీ ఇప్పుడుప్రాణం గురించి దేవుడికి తెలుసునేమో. మనకి తెలియదు కానీ పవరెప్పుడు పోతుందో కరెంటు దీపాలు టప్‌మని ఎప్పుడు ఆరిపోతాయే దేవుడికీ తెలీదు. కరెంటు వాళ్ళకీ తెలియదు. ఎవ్వరికీ తెలీదు.

చీకట్లో ఆడాళ్ళంతా నష్టాలతో, కష్టాలతో రోజులాగేసరికి తెల్లారుతుంది. వాళ్ళ జీవన పోరాటం అర్థం చేసుకోలేనివారికి కూరగాయలు అమ్ముకునే ఆడాళ్ళంతా గయ్యాళులుగా గడుసువారి, గడుగ్గాయిలుగా కనిపిస్తారు.

వాళ్ళ కరుకు ముఖాల వెనక ఉండే మెతక గుండెల్ని చూడాలంటే కళ్ళల్లో దీపాలు వెలిగించుకుని చూడాలి. గుడ్డివెలుతుర్లో కాదు.

(29-06-2002 ఆంధ్రభూమి డైలీ)